“బ్యాంకింగ్ మోసాల పట్ల అవగాహన అవసరం.. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకండి.. డిజిటలైజేషన్ పురోగతితో మోసాలు పెరుగుతున్నాయి.. అనుమానిత లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదు. గ్రామీణ ప్రాంత వాసులకు అవగాహన కల్పించేందుకే ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ నెల 31వరకు జాతీయ స్థాయిలో ఆర్.బి.ఐ జన సురక్షా కాంపెయిన్‌లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని ఏరియాల్లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం..’ అని ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ కొత్తపల్లి శ్రీనివాస రామారావు తెలిపారు. పెరుగుతున్న బ్యాంకింగ్ మోసాల పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ప్రస్తుతం జరుగుతున్న మోసాలు.. పెరుగుతున్న డిజిటలైజేషన్ పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అన్న విషయాలను ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ కొత్తపల్లి శ్రీనివాస రామారావు కెరటం ప్రతినిధితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే...



- వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకండి..
- డిజిటలైజేషన్ పురోగతితో మోసాలు పెరుగుతున్నాయి..
- అనుమానిత లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదు
- గ్రామీణ వాసులకు అవగాహన కల్పించేందుకే ప్రత్యేక కార్యక్రమాలు
- ఈ నెల 31వరకు ఆర్.బి.ఐ జన సురక్షా కాంపెయిన్
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని ఏరియాల్లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు
- ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ కొత్తపల్లి శ్రీనివాస రామారావు

శామ్, జూలై12(కెరటం ప్రతినిధి)

# బ్యాంకింగ్ మోసాల పట్ల అవగాహన అవసరం

**డిజిటలైజేషన్ పురోగతితో పెరుగుతున్న మోసాలు...**

ప్రస్తుత కాలంలో రూపాయి దగ్గర నుంచి రూ.లక్షల్లో ఆన్‌లైన్ ద్వారా ప్రయివేటు యాప్‌లను ఉపయోగించి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఒకందుకు బ్యాంకింగ్ సేవలు సులువుగా.. వేగంగా జరుగుతున్నా... కొంత మంది సైబర్ నేరగాళ్లకు ఇదే మంచి అదునుగా మారింది. మోసగాళ్లు బ్యాంక్ వెబ్‌సైట్ లేదా ఇ-కామర్స్ వెబ్‌సైట్ లేదా సెర్చ్ ఇంజిన్ వంటి ఇప్పటికే ఉన్న నిజమైన వెబ్‌సైట్ లాగా మూడవ పక్షం ఫిషింగ్ వెబ్‌సైట్‌ను సృష్టిస్తారు. ఈ వెబ్‌సైట్‌లకు సంబంధించిన లింక్‌లను మోసగాళ్లు ఎస్.ఎం.ఎస్, సోషల్ మీడియా, ఇమెయిల్, మెసెంజర్ ద్వారా సర్క్యులేట్ చేస్తారు. చాలా మంది కస్టమర్‌లు ఇది నిజమైనదా కాదా అని తనిఖీ చేయకుండా లింక్‌పై క్లిక్ చేసి, మోసగాళ్లు క్యాప్చర్ చేసి ఉపయోగించే పిన్, వన్ టైమ్ పాస్‌వర్డ్, పాస్‌వర్డ్ వంటి సురక్షిత ఆధారాలను నమోదు చేస్తారు. దీంతో వారి ఖాతాల్లో ఉన్న నగదు వెంటనే సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి చేరుతుంది. మొబైల్ బ్యాంకింగ్, మొబైల్ చెల్లింపు యాప్‌లు, లోన్ యాప్‌లు, చెల్లింపులు, ఆన్‌లైన్ లోన్ అప్లికేషన్‌లు జనాదరణ పొందుతున్నందున, బ్యాంకింగ్ పరిశ్రమను లక్ష్యంగా చేసుకున్న మోసగాళ్ళు గణనీయంగా లాభపడుతున్నారు. బ్యాంక్ పాస్ పుస్తకాలు ఎవ్వరికీ ఇవ్వకూడదు. సాధారణంగా ఓ వ్యక్తి చనిపోతే ఆ వ్యక్తికి ఎస్‌బిఐ బ్యాంకులో అకౌంట్ ఉండి.. అందులో నగదు ఉంటే నామినీకి ఇస్తారు. నామినీ లేకుంటే కుటుంబ సభ్యులు ఫ్యామిటీ సర్టిఫికెట్ అందజేస్తే.. ఎవరైనా ఇద్దరు కుటుంబ సభ్యుల సంతకాలతో నగదు ఇస్తారు. అంతేకానీ మధ్య దళారులను నమ్మి మోసపోవద్దు.

**కస్టమర్లకు ఉపయోగపడేలా ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు..**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామాల్లో ఆర్‌బిఐ సమన్వయంతో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఎజెండాను అమలు చేయాలనే ఉద్దేశ్యంతో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా పిఎంజేజేబివై, ఏపివై, బిఎం ఎస్‌బివై, అన్ని రకాల బ్యాంకింగ్ మోసాలు, సేవింగ్స్, డిపాజిట్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, కొత్త ఖాతాలు ఓపెన్ చేయడం, ఆన్‌లైన్‌లో జరిగే మోసాలు వంటి వాటిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఎస్‌బిఐ బ్యాంకుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

## ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆకర్షణీయ మైన మెసేజ్‌లు, ఆఫర్లతో సైబర్ నేరగాళ్లు లింక్‌లు పంపిస్తుంటారు. అలాంటి లింక్‌లను ఎలాంటి పరిస్థితు ల్లోనూ ఓపెన్ చేయకూడదు. అలాగే అనుమతిలేని లోన్ యాప్‌లు, మనీ ట్రాన్స్‌ఫర్ చేసే యాప్‌లు వాడడం కూడా



ప్రమాదం. మీ ఖాతాలో ఉన్న నగదు సైబర్ నేరగాళ్లు అపహరించే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండి, ఎలాంటి సమస్యలు వచ్చినా సంబంధిత బ్యాంకులో సంప్రదించాలి.

- బాదావత్ జగన్,
**బ్యాంక్ మేనేజర్, విద్యానగర్ బ్రాంచ్**
**భద్రాద్రి కొత్తగూడెం రీజనల్ సెక్రెటరీ,**
**ఎస్‌బిఐఓఏహెచ్‌సి**